- కాంగ్రెస్‌కు ఓటేస్తే కరెంటు ఉండదు..
- మానుకోట దమ్ము చూపించాలె
- నాడు సమైక్యవాదులను తరిమిన గడ్డ ఇది..
- మానుకోట మట్టికి దండం.. ఇక్కడి రాళ్లకు దండం..
- వాళ్ల వారసులు మళ్లీ దండెత్తడానికి వస్తున్నరు..
- మీ ఓటుతో వారిని దరిదాపుల్లోకి కూడా రానివ్వొద్దు..
- మహబూబాబాద్ రోడ్డు షోలో మంత్రి తన్నీరు హరీశ్‌రావు



మహబూబాబాద్ పట్టణంలో జరిగిన రోడ్డు షోకు హాజరైన జనం, ఇన్‌సెట్‌లో ప్రజలకు అభివాదం చేస్తున్న మంత్రి హరీశ్‌రావు, ఎమ్మెల్యే శంకర్‌నాయక్

# రిస్క్ వద్దు.. కారుకు గుద్దు..

మహబూబాబాద్, నవంబర్ 25 (నమస్తే తెలంగాణ)/ మహబూబాబాద్: 'నాకు మానుకోటకు ఎంతో అనుబంధం ఉంది. ఉద్యమ సమయంలో ఇక్కడికి వస్తే మీరందరూ అగ్గిరవ్వలై సమైక్యపాలకులపై తిరుగబడ్డరు.. అందుకే మానుకోట అంటే అమితమైన నాకు ప్రేమ. నాడు తెలంగాణపై దండయాత్రకు వచ్చిన సమైక్యవాదులను తరిమికొట్టింండ్రు. ఇయ్యాల అదే దండయాత్రకు వాళ్ల వారుసులొస్తున్నరు. మీ ఓటుతో వాళ్లను దరిదాపుల్లో కూడా లేకుండా తరమాలని' రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన మహబూబాబాద్ పట్టణంలో మంత్రి సత్యవతి రాథోడ్, ఎంపీ మాలోత్ కవిత, ఎమ్మెల్యే అభ్యర్థి బానోత్ శంకర్‌నాయక్‌తో కలిసి రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సమైక్యవాదులు ఇక్కడికి దండయాత్రకు వచ్చిన రోజు మానుకోట ప్రజలు వారిని తరిమికొట్టారు.. మానుకోట మట్టికి దండం. మానుకోట రాళ్లకు దండం. మానుకోట యువతకు దండం. మానుకోట దెబ్బతో సమైక్యవాదులు పారిపోయారని అన్నారు. ఇప్పుడు మళ్లీ సమైక్యవాదులొక్కటై తెలంగాణ మీద దండెత్తడానికి వస్తున్నరు.. వారికి మన మానుకోట దమ్మేంటో చూపించాలన్నారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు మంచిగ పనిచేసి శంకర్‌నాయక్‌ను మూడోసారి గెలిపించాలని కోరారు. తెలంగాణ రాక ముందు మానుకోట ఎలా ఉండె.. ఇప్పుడేలా ఉందో గమనించాలన్నారు. ఇక్కడ రోడ్లు సిద్దిపేట కంటే బాగున్నాయన్నారు. గులాబీ జెండా లేకుంటే మానుకోట జిల్లా అయ్యేదా.. మెడికల్ కాలేజీ, ఇంజినీరింగ్ కాలేజీ, హార్టికల్చర్ కాలేజ్ వచ్చేదా.., తండాలు గ్రామ పంచాయతీలయ్యేవా.., పోడు భూములకు పట్టాలు వచ్చేవా.. ప్రజలు ఒక్కసారి మనసుపెట్టి ఆలోచించాలన్నారు. రాహుల్‌గాంధీ, ప్రియాంకగాంధీ కర్ణాటకలో ప్రచారం చేసి ఐదు గ్యారెంటీలు అని ఊదరగొట్టి అక్కడి ప్రజలను మోసం చేశారని అన్నారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి ఏ విషయం మీద పూర్తి అవగాహన ఉండదని, అడ్డగోలుగా నోటికి ఏదొస్తే అదే మాట్లాడుతాడని అన్నారు. బూతులు మాట్లాడే నాయకులు కావాలా.. భవిష్యత్ అందించే నాయకుడు కావాలా ఆలోచించాలన్నారు. నాడు కాల్వల్లో తుమ్మచెట్లు మొలిచి ఒక పంటకు కూడా సరిపడా నీళ్లు రాక పంటలు ఎండిపోయిన రోజులను చూశాం. ఇప్పుడు సీఎం కేసీఆర్ కృషితో తెలంగాణ రెండు పంటలకు పుష్కలంగా నీళ్లు అందుతున్నాయన్నారు. నాడు అర్ధరాత్రి వచ్చే దొంగ కరెంటు కోసం బావుల కాడికి కావలి పోయిన రోజులు మర్చిపోయింండ్రా.. రైతులు గుర్తు తెచ్చుకోవాలన్నారు. రైతులను బిచ్చగాళ్లన్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డికి వాళ్లే గుణపాఠం చెబుతారని అన్నారు. 24 గంటల నాణ్యమైన కరెంట్ కావాలంటే కారుకు ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. రైతుబంధు ఆపాలని కాంగ్రెస్ కుట్రలు చేసింది.. కేసీఆర్ చేసిన కృషి వల్ల కేంద్ర ఎన్నికల సంఘం అనుమతి ఇచ్చిందన్నారు. సోమవారం రైతుల బ్యాంకు ఖాతాల్లో రైతుబంధు డబ్బులు జమై, సెల్‌ఫోన్లకు టింగ్.. టింగ్ అని మెసేజ్‌లు వస్తాయన్నారు. సీఎం కేసీఆర్ అంటే మాట తప్పనోడని, ఇప్పటివరకు 90 శాతం హామీలను నెరవేర్చాడని అన్నారు. ఇంకో పదిపైసల వంతు పనిచేయాల్సి ఉందని, కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రి కాగానే మిగతా పనులన్నీ పూర్తి చేస్తామన్నారు. మూడోసారి అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ, బీసీ అసైన్డ్ భూములను పట్టా భూములుగా గుర్తిస్తామని చెప్పారు. ఆసరా పింఛన్లను రూ.2వేల నుంచి రూ.5వేలకు పెంచుతామన్నారు. రేషన్ షాపుల్లో సన్న బియ్యం, మహిళలకు రూ. 400కే గ్యాస్ సిలిండర్, పేద మహిళలకు ప్రతినెలా రూ. 3వేలు ఇస్తామని చెప్పారు. శంకర్‌నాయక్ మాట కరుకు.. మనుసు మంచిదని, సిద్దిపేటకు నేను తేలేని కాలేజీలను శంకర్‌నాయక్ మహబూబాబాద్‌కు తెచ్చుకున్నాడని అన్నారు. లంబాడాలకు అత్యధిక ఎమ్మెల్యే టికెట్లు, ఎస్సీ, ఎస్టీలకు పది శాతం రిజర్వేషన్ ఇచ్చింది కేసీఆరేనని, మీ ఆఖరి డిమాండ్ అయిన గిరిజనబంధును ఈ సారి పక్కాగా అమలు చేస్తామని హామీ ఇచ్చారు. ఈ రోడ్ షోలో జడ్పీ చైర్‌పర్సన్ అంగోతు బిందు, మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్ రెడ్డి, బీఆర్‌ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నూకల నరేశ్‌రెడ్డి, బీరెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ ఫరీద్, బీఆర్‌ఎస్ పట్టణ అధ్యక్షుడు గద్దె రవి, యాళ్ల మురళీధర్‌రెడ్డి, మార్నేని వెంకన్న, రఘు, గోగుల రాజు, గుండా రాజశేఖర్ పాల్గొన్నారు.

## నా జీవితం మానుకోట ప్రజలకు అంకితం

మహబూబాబాద్ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్

నా జీవితం మానుకోట ప్రజలకు అంకితం.. నన్ను విజయపథంలో నడిపిస్తున్న వారికి జీవితాంతం రుణపడి ఉంటానని బీఆర్‌ఎస్ మహబూబాబాద్ అభ్యర్థి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్ అన్నారు. కసాయి కాంగ్రెస్‌ను, జూటా మాటల బీజేపీకి ఇక్కడ ఘోర పరాభవం తప్పదన్నారు. ఈనెల 30న ఎన్నికలు.. వచ్చే నెల 3న ఫలితాలు వస్తాయి. ఆ తరువాత కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థులు పరారవుతారని అన్నారు. మానుకోట గడ్డపై సగర్వంగా గులాబీ జెండా ఎగరబోతున్నదన్నారు. నిత్యం తన వెంట నడుస్తున్న అన్నదమ్ములు, అక్కాచెల్లెళ్లకు రుణపడి ఉంటానన్నారు. సీఎం కేసీఆర్ దయతో కలెక్టరేట్, మెడికల్ కళాశాల, ఇంజినీరింగ్ కళాశాల, హార్టికల్చర్ డిగ్రీ కళాశాల తెచ్చానన్నారు. రానున్న రోజుల్లో నియోజకవర్గానికి మరిన్ని విద్యా సంస్థలు తీసుకొచ్చి మహబూబాబాద్ మున్సిపాలిటీని మరింత అభివృద్ధి చేసి చూపిస్తానని చెప్పారు.

## రోడ్డు 'షో' సక్సెస్..

బీఆర్‌ఎస్ పార్టీ మానుకోట పట్టణంలో నిర్వహించిన రోడ్డు ఫుల్ షో సక్సెస్ అయ్యింది. ఓపెన్‌టాప్ జీపులో మంత్రి హరీశ్‌రావుకు దారి పొడవునా నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ర్యాలీగా వస్తుంటే కార్యకర్తలు మంత్రి హరీశ్‌రావు మీద పూలవర్షం కురిపించారు. ఓపెన్‌టాప్ జీపులో మంత్రి హరీశ్‌రావు వెంట మంత్రి సత్యవతిరాథోడ్, ఎంపీ మాలోత్ కవిత,ఎమ్మెల్యే శంకర్‌నాయక్, జడ్పీ చైర్‌పర్సన్ బిందు, నూకల నరేశ్‌రెడ్డి, బీరెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ ఫరీద్, మురళీధర్‌రెడ్డి, కేఎస్‌ఎన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, లక్ష్మణ్ పాల్గొన్నారు. రోడ్డు షో సక్సెస్ కావడంతో బీఆర్‌ఎస్ శ్రేణులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



మంత్రి హరీశ్‌రావు రోడ్డుషో లో నినాదాలు చేస్తున్న ప్రజలు